# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 04-11-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లండన్ పర్యటనలో భాగంగా బ్రిటన్‌లో భారత హైకమిషనర్ విక్రమ్ దొరైస్వామితో సమావేశమయ్యారు.
- గ్రామాలలో రహదారుల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం 2 వేల కోట్ల రూపాయల సాస్కి నిధులను సమకూర్చిందని ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ తెలిపారు.
- రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 757 గిరిజన పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం 113 కోట్ల రూపాయలను మంజూరు చేసింది.
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో అదనంగా మరో 8 ప్రత్యేక నవజాత శిశు సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.
- రాష్ట్ర స్థాయి విలు విద్య (ఆర్చరీ) పోటీలు నవంబర్ 7 నుండి అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో జరగనున్నాయి.

==========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లండన్ పర్యటన కొనసాగుతోంది. ఈ పర్యటనలో భాగంగా బ్రిటన్‌లోని భారత హైకమిషనర్ విక్రమ్ దొరైస్వామితో ముఖ్యమంత్రి ఈరోజు సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్ బ్రిటన్ మధ్య వాణిజ్య సంబంధాలు, విద్యా రంగంలో సహకారం మొదలగు విషయాలపై ఈ సందర్భంగా చర్చించామని చంద్రబాబు నాయుడు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా వెల్లడించారు.

==========================

గ్రామీణ ప్రాంతాలో రహదారుల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం 2 వేల కోట్ల రూపాయల నిధులను సమకూర్చిందని ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ తెలిపారు. రహదారుల స్థితిగతులను మార్చి నూతన రోడ్ల ను నిర్మించుకునేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం 'సాస్కి' పథకం ద్వారా రాష్ట్రానికి ఈ నిధులు సమకూర్చిందన్నారు. ఈ నిధులతో గ్రామాల్లో దెబ్బ తిన్న పంచాయతీరాజ్ రోడ్లను పునర్ నిర్మించే కార్యక్రమం చేపడుతున్నామని, ఇందులో పూర్తిగా దెబ్బ తిన్న రోడ్లకు

మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని పంచాయతీరాజ్ ఉన్నతాధికారులు, ఇంజినీరింగ్ అధికారులకు ఉపముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ రహదారుల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. నిర్మాణ దశ నుంచి పూర్తయ్యే వరకూ పలు దఫాలుగా రహదారుల నాణ్యతను తనిఖీ చేస్తామని పవన్ కళ్యాణ్ ఈ రోజు ఒక ప్రకటనలో తెలిపారు.

===========================

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 9 ఐటీడీఏల పరిధిలోని 757 గిరిజన పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం 113 కోట్ల రూపాయలను మంజూరు చేసిందని గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. ఈ 113 కోట్ల రూపాయలలో 83 కోట్ల రూపాయలు గిరిజన ఆశ్రమ పాఠశాలలకు, 30 కోట్ల రూపాయలు గురుకుల పాఠశాలలకు ఇవ్వడం జరిగిందన్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో మంత్రి ఈ రోజు పాత్రికేయులతో మాట్లాడుతూ... ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గిరిజన పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకై గత ఏడాది 155 కోట్ల రూపాయలను ఖర్చు చేసిందన్నారు. రాష్ట్రంలో మొత్తం 757 గిరిజన పాఠశాలలు ఉండగా.. వాటిలో 119 గురుకులాలు, 558 ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయని మంత్రి వెల్లడించారు. వీటన్నింటిలో ఆర్ ఓ వాటర్ ప్లాంట్స్, మరుగుదొడ్లు, నిర్మించనున్నామని మంత్రి వివరిస్తూ...

(వాయిస్ 33 సెకన్లు)

===========================

రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అప్పుడే పుట్టిన శిశువుల కోసం అదనంగా మరో 8 ప్రత్యేక నవజాత శిశు సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. వీటి ద్వారా అదనంగా 80 పడకలు అందుబాటులోకి రానున్నాయని పేర్కొన్నారు. ఒక్కో సంరక్షణ కేంద్రం ఏర్పాటుకు 60 లక్షల రూపాయలు అవసరం కాగా మొత్తం ఎనిమిదింటికి 4.80 కోట్ల రూపాయాలు ఖర్చవుతుందన్నారు. అలాగే వీటి నిర్వహణకు నెలకు దాదాపు కోటీ 7 లక్షల రూపాయలు ఖర్చవుతుందని తెలిపారు. కోనసీమ, చిత్తూరు, అనంతపురం, కర్నూలు జిల్లాలలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్య సేవలు ఈ నెలాఖరులోగా అందుబాటులోకి వస్తాయని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు.

===========================

సామాజిక మాధ్యమాల్లో పోలీసులపై తప్పుడు ప్రచారాలు చేస్తే సహించబోమని, అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. తుళ్లూరులో ఈ రోజు డీఎస్పీ కార్యాలయాన్ని ప్రారంభించిన సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... పోలీసులకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. అలాగే వారి ఆరోగ్యం, భద్రతకు అధిక ప్రాధాన్యతను ఇస్తామన్నారు. పోలీసులకు నూతన సాంకేతికతను అందిస్తామని, 6,100 కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేస్తున్నామని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో అమరావతి నిర్మాణం పూర్తి చేస్తామన్నారు.

విరామం

===========================

గుంటూరు జిల్లా మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ఈరోజు నిర్వహించారు. పార్టీ కేంద్ర కార్యాలయానికి వచ్చిన సుమారు 2 వేల మందికి పైగా బాధిత ప్రజలను కలిసిన మంత్రి వారి నుంచి విజ్ఞప్తులు స్వీకరించారు. సమస్యల పరిష్కారం కోసం అప్పటికప్పుడే సిబ్బందికి మంత్రి ఆదేశాలు జారీ చేశారు.

===========================

రాష్ట్ర స్థాయి విలు విద్య (ఆర్చరీ) పోటీలు నవంబర్ 7వ తేదీ నుండి అల్లూరి సీతారామరాజు జిల్లాలో జరగనున్నాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నవంబర్ 7 నుంచి మూడు రోజుల పాటు జిల్లాలోని పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఈ పోటీలు జరగనున్నాయి. అండర్ 14, 17, 19 విభాగాల్లో మొత్తం 13 జిల్లాల నుండి సుమారు 936 మంది బాల, బాలికలు ఈ రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని కలెక్టర్ ఏ.ఎస్. దినేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

=========================

విశాఖపట్టణంలోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో నవంబర్ 21 నుంచి జరగనున్నమార్గశిర మాసోత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈరోజు కలెక్టరేట్ మీటింగు హాలులో జరిగిన సమన్వయ కమిటీ సమావేశంలో పలు అంశాలపై ఆయన మార్గదర్శకాలు జారీ చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ప్రణాళికతో చర్యలు చేపట్టాలని, ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలన్నారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని, వాహనాలకు పార్కింగ్ సదుపాయం కల్పించాలని కలెక్టర్ సూచించారు.

=========================

పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేటలోని ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్కులో ఏర్పాటు చేసిన హాట్ ఎయిర్ బెలూన్ ద్వారా విహంగ వీక్షణం చేస్తూ ప్రకృతి అందాలను తిలకించవచ్చని సీతంపేట ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి పవార్ స్వప్నిల్ జగన్నాథ్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఈరోజు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ హాట్ ఎయిర్ బెలూన్ గరిష్టంగా నలుగురిని 300 మీటర్ల ఎత్తు వరకూ తీసుకువెళ్తుందన్నారు. ఉదయం 7 గంటల నుంచి 12 గంటల వరకు, అలాగే మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 8 గంటల వరకు వాతావరణ పరిస్థితులను బట్టి అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. భద్రతా పరంగా అన్ని రకాలుగా అనుకూలంగా ఉంటుందన్నారు.

=========================

సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని మై భారత్ ఆధ్వర్యంలో విజయనగరం జిల్లాలో నిర్వహించనున్న సర్దార్@150 ఐక్యతా మార్చ్ ప్రచార పోస్టర్లను కలెక్టర్ డాక్టర్ ఎన్. ప్రభాకరరెడ్డి ఆయన ఛాంబర్ లో ఈరోజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశ సమగ్రత కోసం చేసిన కృషిని కొనియాడారు. ఉక్కు మనిషిగా పేరుగాంచిన సర్దార్ పటేల్ దూరదృష్టి, నాయకత్వ పటిమ వల్లే దేశం ఏకమైందని, ఆయన ఆశయాలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ ఐక్యతా మార్చ్ అక్టోబర్ 30 నుండి నవంబర్ 24 వరకు జిల్లా స్థాయి పాదయాత్రగా కొనసాగుతుందని తెలిపారు.

=========================

ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతానికి ఆనుకుని పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 900 మీటర్ల ఎత్తులో కొనసాగుతోందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ఫలితంగా ఈరోజు, రేపు రాష్ట్రంలోని పలుచోట్ల తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం అధికారి బి. శేఖర్ తెలియజేస్తూ…

(వాయిస్ 24 సెకన్లు)

=========================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు భారీ నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 83,978 పాయింట్ల వద్ద స్వల్ప లాభాల్లో ప్రారంభమై.. చివరికి 519 పాయింట్లు నష్టపోయి 83,459 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 165 పాయింట్లు తగ్గి

25,597కి చేరింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 88 రూపాయల 66 పైసలుగా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 63 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 3,994 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

============================

============================